JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 25-03-2026
Medchal - Malkajgiri | Wednesday 25-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 297
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 297 | Pages : 8 | ₹: 5




## దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం

- వాట్ ఇండియా థింక్స్ టుడే
- సీఎం రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్ :

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరాన్ని మరింతగా పెంచే ప్రయత్నాలను విరమించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల వారిగా ఉన్న లోక్‌సభ స్థానాల నిష్పత్తిలోనే నియోజకవర్గాలను పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న స్థానాలకు 50 శాతం సీట్లు పెంచుతూ లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపడితే, రేపటి రోజున జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల పాత్ర ఉండదని విశ్లేషించారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండా పోతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. టీవీ9 నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 'భారతదేశం ప్రపంచం' అన్న ఇతివృత్తంపై "వాట్ ఇండియా థింక్స్ టుడే" సమ్మిట్ 2026 లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మూసీ నది ప్రక్షాళన, తెలంగాణ విజన్ 2047, పరిపాలన, రాజకీయ స్థితిగతులపై అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో 50 శాతం మేరకు సీట్లను పెంచాలన్న నిర్ణయం ఏ ప్రాతిపదికన చేశారని ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరాన్ని పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై తొలుత అఖిల పక్ష సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయం మేరకు మార్గదర్శకాలు రూపొందించాల్సిందని అన్నారు. అలా కాకుండా ముందే నిర్ణయం తీసుకుని, తర్వాత అందరి అభిప్రాయాలు అడగడటం సమంజసం కాదన్నారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలనే మేం కోరుకుంటున్నామని చెప్పారు. ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలే కేంద్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురికావడమే కాకుండా తీరని నష్టం జరుగుతుందని అన్నారు. మంచి ఎక్కడున్నా స్వీకరిస్తామని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు హైదరాబాద్‌కు మూడు బుల్లెట్ ట్రెయిన్లు ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు చెప్పానని గుర్తుచేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత సమస్యను ఎదుర్కొనడానికి కార్యాచరణ ప్రకటించాలని కోరారు.




# లోకసభ అసెంబ్లీ స్థానాల పెంపు

- ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 ఎంపీ సీట్లు 816 సీట్లుగా పెంపు
- 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ కోటాను కూడా అమలు
- తెలంగాణలో.. 26 లోక్‌సభ, 179 అసెంబ్లీ స్థానాలకు పెంపు

జయభేరి, హైదరాబాద్, మార్చ్ 24 :

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. అదే సమయంలో ఇప్పటికే మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం.. దాన్ని అమలు చేయాలంటే ముందు దేశంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గాల పునర్విభజన చేసి.. ఆ తర్వాత మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టి.. ఒకే దేశం ఒకే ఎన్నిక నిర్వహించేందుకు మోదీ సర్కార్ కసరత్తులు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే నియోజకవర్గాల పునర్విభజనతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు భారీగా పెరగనున్నాయి. త్వరలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను, అలాగే పార్లమెంట్ స్థానాలను కేంద్రం పెంచబోతున్న సంగతి తెలిసిందే. అటు అసెంబ్లీలలో, ఇటు పార్లమెంట్‌లో 50 శాతం సీట్లను కేంద్రం పెంచబోతుంది. అలాగే, 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ కోటాను కూడా అమలు చేయనున్నారు. ఇక ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 ఎంపీ సీట్లు 816 సీట్లుగా మారుతాయి. తెలంగాణ అసెంబ్లీకి సంబంధించి 119 స్థానాలుండగా, ఈ సంఖ్య 2029లో 179కి చేరుతుంది. తెలంగాణ పర్యాటకంఅలాగే తెలంగాణలో ప్రస్తుతం 17 ఎంపీ స్థానాలుండగా, వీటి సంఖ్య 26కు చేరనుంది. ఎంపీ సీట్లకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఎన్ని స్థానాలు దక్కుతాయో చూద్దాం. యూపీలో ప్రస్తుతం ఉన్న 80 ఎంపీ సీట్లు 120కి, మహారాష్ట్రలో 48 నుంచి 72కు, పశ్చిమ బెంగాల్‌లో 42 నుంచి 63కు, బీహార్‌లో 40 నుంచి 60కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 44కు, రాజస్థాన్‌లో 25 నుంచి 38కి, గుజరాత్‌లో 26 నుంచి 39కి, ఒడిశాలో 21 నుంచి 32కి, ఝార్ఖండ్‌లో 14 నుంచి 21కి, అసోంలో 14 నుంచి 21కి,

...మిగతాది 2 లో

**దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్న వేళ.. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్య భారీగా పెరగనుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోనూ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో గణనీయమైన పెరుగుదల ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక లోక్‌సభ స్థానాల సంఖ్య 26కు.. అసెంబ్లీ సీట్ల సంఖ్య 179కు పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ల బిల్లు అమల్లోకి రానుంది.**

## జీవన్ రెడ్డితో టీపీసీసీ నేతల భేటి



- జీవన్ రెడ్డి మాత్రం తన పంతం వీడటం లేదు
- ఇంటిపై ఇందిరాగాంధీ ఫ్లెక్సీల తొలగింపు

జయభేరి, జగిత్యాల :

కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సీనియర్ నేత, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి .. పార్టీని వీడేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే పార్టీ హైకమాండ్ రంగంలోకి దిగి జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. తాజాగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రంగంలోకి దిగినా జీవన్ రెడ్డి వెనక్కి తగ్గడం లేదు. పార్టీ నుంచి వెళ్లిపోవాలనే ఆయన డిసైడ్ అయినట్లు అర్థం అవుతోంది. తాజాగా జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డితో భేటీ అయిన పీసీసీ చీఫ్.. పార్టీలోనే కొనసాగాలని.. కాంగ్రెస్‌ను వీడొద్దని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ జీవన్ రెడ్డి మాత్రం ససేమిరా వెనక్కి తగ్గలేదని తెలుస్తోంది. జీవన్ రెడ్డితో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇవాళ జగిత్యాలలో కీలక భేటీ నిర్వహించారు. పార్టీని వీడొద్దని.. కాంగ్రెస్‌లోనే కొనసాగాలని.. విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చీఫ్ చర్చలు జరిపారు. అంతకుముందు ఏఐసీసీ నేతలు కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగాలని ఆయనను కోరినా.. జీవన్ రెడ్డి మాత్రం తన పంతం వీడటం లేదు. ఇక ఈ భేటీ తర్వాత

...మిగతాది 2 లో



## నేడు అఖిల పక్ష సమావేశం

- కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు ప్రిపేర్డై ఉండాలి : ప్రధాని మోదీ

జయభేరి, న్యూఢిల్లీ, మార్చ్ 24 :

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమవారం లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు ప్రిపేర్డై ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

## ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసినా వారిపై కఠిన చర్యలు

- తెలంగాణలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (LPG) కొరత లేదు
- భయాందోళనలతో కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి




జయభేరి, హైదరాబాద్, మార్చి 24 :

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ (LPG) కొరత ఏమాత్రం లేదని తెలంగాణ ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ స్పష్టం చేస్తోంది. ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం పూర్తిగా, సక్రమంగా పనిచేస్తోంది. అన్ని జిల్లాల్లోని ప్రజల

...మిగతాది 2 లో



## క్రైస్తవంలో మారితే ఎస్సీ హోదా రద్దు

- మాత మార్పిడిలపై సుప్రీం కోర్టు కీలక తీర్పు

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 24 :

ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి, దానిని చురుకుగా ఆచరిస్తే, అతను షెడ్యూల్డ్ కుల సమాజంలో సభ్యుడిగా కొనసాగలేడని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

...మిగతాది 2 లో

## ఇంటింటికీ గంగమ్మ

- డ్వాక్రా మహిళలకు కీలక బాధ్యతలు




జయభేరి, న్యూఢిల్లీ, మార్చ్ 24 :

రాష్ట్రంలోని ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని నిరంతరాయంగా అందించడమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది.

మొదటిపేజీ తరువాయి

## లోకసభ.. అసెంబ్లీ స్థానాల పెంపు

పంజాబ్‌లో 14 నుంచి 21కి, ఛత్తీస్‌గఢ్‌లో 11 నుంచి 17కు, హరియాణాలో 10 నుంచి 15కు, ఢిల్లీలో 7 నుంచి 11కు, జమ్మూకాశ్మీర్‌లో 5 నుంచి 8కి, ఉత్తరాఖండ్‌లో 5 నుంచి 8కి సీట్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 4 నుంచి 6కు, గోవాలో 2 నుంచి 3 సీట్లకు పెరగనుండగా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, మిజోరం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు అన్నింట్లో రెండేసి సీట్లుండగా, ఇప్పుడు 3 సీట్లు అవుతాయి. అంటే కేంద్ర పాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల్లో ఇప్పటిదాకా 20 ఎంపీ సీట్లుండగా, ఇకపై 30 సీట్లు అవుతాయి.ఇక దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 సీట్లుండగా 59కి, కర్ణాటకలో 28 సీట్లుండగా 42కు, ఏపీలో 25 సీట్ల నుంచి 38కి, కేరళలో 20 నుంచి 30కి పెరుగుతాయి. అలాగే నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయి. ఇప్పటివరకు లోక్‌సభలో 84 ఎస్సీ రిజర్వుడ్ సీట్లుండగా వీటి సంఖ్య 126కు పెరగనుంది. అలాగే, 47 ఎస్టీ సీట్లుండగా, 70 సీట్లకు పెరగనుంది. 2011 నాటి జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుని సీట్ల సంఖ్యను కేంద్రం పెంచబోతుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లును కేంద్ర త్వరలోనే పార్లమెంట్ లో ప్రవేశబెట్టబోతుంది.

## జీవన్ రెడ్డితో టీపీసీసీ నేతల భేటి

మీడియాతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. జీవన్ రెడ్డి తనకు తండ్రి సమానులు అని.. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయన అని తెలిపారు. తెలంగాణలో జీవన్ రెడ్డి కన్నా సీనియర్ నాయకులు లేరని.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కొంత ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. ఈ వయసులో నూ జీవన్ రెడ్డి ఇబ్బంది పడ్డారని..రాజకీయాల్లో కొన్నిసార్లు అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఆయన ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టే తన సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు కూడా వచ్చారని పేర్కొన్నారు. ఇవాళ తాను కూడా జగిత్యాలకు వెళ్లి కలిసినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకోవద్దని.. తమను వీడొద్దని వారికి విన్నవించినట్లు చెప్పుకొచ్చారు. కార్యకర్తల ఒత్తిడి కారణంగా జీవన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జీవన్‌రెడ్డితో తనకు 1986 నుంచి పరిచయం ఉందని.. అప్పటి నుంచి తనకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయరనే ఆశతో జగిత్యాల నుంచి వెళ్తున్నానని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. మరోవైపు.. ఈ భేటీ సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు కూడా జీవన్ రెడ్డి ఆసక్తి చూపకపోవడం గమనార్హం. మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో పార్టీ నేతలు జీవన్ రెడ్డి మెడలో హస్తం పార్టీ కండువా వేసేందుకు ప్రయత్నించగా.. ఆయన తిరస్కరించారు. ఇక వీరి భేటీ తర్వాత జీవన్ రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని ఆయన అభిమానులు తొలగించారు. ఇందిరా భవన్ పేరుతో ఉన్న ఫ్లెక్సీని తీసేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన జీవన్‌రెడ్డి.. ఇది పరిష్కారం లేని సమస్యగా మారిందని.. ఆ సమస్యకు పరిష్కారం కూడా తన వద్ద లేదని తెలిపారు. దీనికి పరిష్కారం వారి దగ్గర కూడా లేదని పేర్కొన్నారు. బుధవారం 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ కావాలని.. గార్డెన్‌కి రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు, తన తర్వాతి పయనం ఎలా ఉంటుందో తెలియదని పేర్కొన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం చేయలేనని తేల్చి చెప్పారు. తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించనున్నట్లు చెప్పిన జీవన్ రెడ్డి.. తన నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జీవన్‌రెడ్డి బుధవారం రోజున రాజీనామా చేయనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఇప్పట్లో ఏ పార్టీలో చేరేది లేదని ఇప్పటికే జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## క్రైస్తవంలో మారితే ఎస్సీ హోదా రద్దు

ఉత్తర్వును సుప్రీంకోర్టు సమర్థించింది. హిందూమతం, సిక్కు మతం లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతాన్ని ఆచరించే ఏ వ్యక్తిని షెడ్యూల్డ్ కుల సభ్యునిగా పరిగణించలేమని సుప్రీం కోర్టు పేర్కొంది. మత మార్పిడిలపై మంగళవారం సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. మరో మతంలోకి మారడం వల్ల షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులో స్పష్టం చేశారని, ఈ ఉత్తర్వు కింద విధించిన నిషేధం సంపూర్ణమైనదని కోర్టు పేర్కొంది. 1950 నాటి ఉత్తర్వులోని సెక్షన్ 3లో పేర్కొనని ఏ మతంలోకి మారినా, పుట్టుకతో సంబంధం లేకుండా తక్షణమే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని కోర్టు స్పష్టం చేసింది. సెక్షన్ 3 ప్రకారం షెడ్యూల్డ్ కులానికి చెందిన సభ్యునిగా పరిగణించని వ్యక్తి, రాజ్యాంగం లేదా మరే ఇతర చట్టం కింద ఎలాంటి చట్టబద్ధమైన ప్రయోజనం, రక్షణ, రిజర్వేషన్ లేదా హక్కును పొందలేరని లేదా క్లెయిమ్ చేయలేరని కోర్టు తీర్పు ఇచ్చింది. షెడ్యూల్డ్ కులం లేదా షెడ్యూల్డ్ తెగ సభ్యునిగా గుర్తింపు పొందాలంటే, ఒక వ్యక్తి రాజ్యాంగం ప్రకారం ప్రత్యేకంగా నోటిఫై చేయబడి, గుర్తించిన అటువంటి కులం లేదా తెగకు తాను చెందినవాడినని స్పష్టంగా నిరూపించుకోవాలి. క్రైస్తవ మతంలోకి మారి, పాస్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి తనపై దాడి చేశారని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులపై షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టం కింద కేసు దాఖలు చేసిన కేసులో ఈ ఉత్తర్వు జారీ అయ్యింది. అతను ఎస్సీ,ఎస్టీ చట్టం కింద రక్షణ కోరగా, ఆ పాస్టర్ మతం మారి క్రైస్తవ మతాన్ని చురుకుగా ఆచరిస్తున్నందున ఆ చట్టం చెల్లదని నిందితులు సవాలు చేశారు. ఏప్రిల్ 30, 2025 నాటి ఉత్తర్వు ద్వారా కుల వ్యవస్థ క్రైస్తవ మతానికి విరుద్ధమైనదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పేర్కొంది. అందువల్ల అటువంటి వ్యక్తులకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టంలోని నిబంధనల ప్రయోజనాలు నిరాకరించింది. క్రైస్తవ మతంలోకి మారి, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని ప్రయోగించిన ఫిర్యాదిదారు దాఖలు చేసిన ఆరోపణలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ ఎన్. కొట్టివేశారు

## ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసినా వారిపై కఠిన చర్యలు

రోజువారీ అవసరాలను తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకులలో పొడవైన క్యూలు, తాత్కాలికంగా "నో స్టాక్" (No Stock) బోర్డులు కనిపించడానికి ప్రధాన కారణం, తప్పుడు వదంతుల వల్ల ప్రజలు భయపడి అకస్మాత్తుగా ఇంధనం కొనుగోలు చేయడానికి ఎగబడటమే. డిపోలలో తగినంత ఇంధనం ఉన్నప్పటికీ, ప్రజలు అనవసరంగా తమ వాహనాల ట్యాంకులను పూర్తిగా నింపుకోవడానికి పరుగులు తీయడం వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడుతోంది. అంతేకాకుండా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపు విధానాల్లో చేసిన కొన్ని మార్పుల వల్ల స్థానిక డీలర్లకు చిన్నపాటి తాత్కాలిక సమస్యలు ఎదురయ్యాయి. ఇది కేవలం అంతర్గత పరిపాలన పరమైన విషయం మాత్రమే తప్ప, సరఫరాలో లోపం కాదు. పరిస్థితిని చక్కదిద్ది, అందరికీ సమానంగా ఇంధనం అందేలా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పెట్రోలియం సంస్థలు, పోలీసు శాఖతో కలిసి పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెట్ చేసినా లేదా గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య (కమర్షియల్) అవసరాలకు అక్రమంగా మళ్లించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము.

## ట్రాన్స్ జెండర్లకు ఆటోలు

జయభేరి, విశాఖపట్నం :

విశాఖలో ట్రాన్స్ జెండర్స్ కి ఆటోలను మంత్రి డిఎస్ బీవీ స్వామి అందించారు. ట్రాన్స్ జెండర్ల స్వయం ఉపాధి కోసం సబ్సిడీకి ఆటోల పంపిణీ చేశారు. ట్రాన్స్ జెండర్స్ సమాజంలో గౌరవంగా జీవించాలన్న ఉద్దేశ్యంతో వారికి ఉపాధి కల్పిస్తున్నామని, విశాఖలో 20 మంది ట్రాన్స్ జెండర్స్ ని కేజీ హెచ్ శానిటేషన్ సూపర్వైజర్లుగా నియమించామని తెలిపారు. మరి కొంతమందిని గుర్తించి ఉపాధి కల్పిస్తామని, ట్రాన్స్ జెండర్స్ కి గుర్తింపు కార్డులు ఇస్తున్నాం, సింగిల్ రేషన్ కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని అన్నారు. ట్రాన్స్ జెండర్స్ కి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ట్రాన్స్ జెండర్స్ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్నారా..?

# జర పైలం బిడ్డ..!

రోజురోజుకు ఔటర్ రింగ్ రోడ్డుపై పెరుగుతున్న వాహనాల రద్దీ... అంతే వేగంతో ప్రమాదాలు కూడా... టోల్గేట్ వసూళ్లు మూడు పువ్వులు ఆరు కాయలు... మెయింటెనెన్స్ లో మాత్రం మొండి చేయి... ఓ ఆర్ ఆర్ పై ఇది వరుస వాహనదారులు మీకే ఈ అలర్ట్....! హైదరాబాద్ మరొక భాషలో చెప్పాలంటే భాగ్యనగరం. ఓ ఆర్ ఆర్ అంటే భాగ్యనగరానికి మెడలో బంగారు హారంగా మనం వర్ణించుకున్నం... ఇంతవరకు చదవడానికి బాగానే ఉన్నా అసలు విషయం తెలిస్తేనే గుండె గాబరా అవుతుంది అనేది ఖాయం... ఇదే విషయంపై "జయభేరి" ఎక్స్ క్లూజివ్ గా అందిస్తున్న కౌంటర్ విత్ కదారి శ్రీనివాస్ సమగ్ర విశ్లేషణ...

జయభేరి, హైదరాబాద్ :



ఔటర్ రింగ్ రోడ్డు ఇది చాలా సులువైన మార్గం అని మనలో అందరికీ తెలుసు. ట్రాఫిక్ జామును తపించుకోవడానికి ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా కాస్త కిలోమీటర్లు ఎక్కువైనా సరే హాయిగా వెళ్లొచ్చు అనే వాహనదారులకు చేదు వార్త ఇది. వరుస ప్రమాదాలు ఓఆర్ఆర్ రహదారి మీద జరగడం ఈమధ్య అలవాటుగా మారిపోయింది. ఓ ఆర్ ఆర్ మీద రోజుకు రెండు లక్షల నుంచి 2, లక్షల 46 వేల వాహనాలు వెళుతున్నాయి.. ఒక సంవత్సరానికి చూసుకుంటే ఏడు నుంచి తొమ్మిది కోట్ల వాహనాలు ఓఆర్ఆర్ పై పయనిస్తున్నాయి. నిజానికి గమ్యాన్ని చేర్చడంలో ఔటర్ రింగ్ రోడ్డు కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇదే విషయం ఓ ఆర్ ఆర్ పై ప్రయాణించే కార్లు హెవీ వెహికల్ వాటి వేగం పరిమితిని మించి వెళుతుండడం ప్రమాదాలకు సంకేతంగా మారుతుంది.. ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా పెరుగుతూ ఉండటం వల్ల ఘనం కాలు ఒక్కసారి పరిశీలిస్తే గత పది సంవత్సరాల గణాంకాలు తీసుకుంటే ఒక వెయ్యి 66 ప్రమాదాలు జరిగినట్టుగా మనకు తెలుస్తోంది. ఇక సంవత్సరానికి చూసుకుంటే 1000 ప్రమాదాలు జరిగినట్టుగా అంచనా. ఇక అలాగే 2023 సంవత్సరంలోనే ప్రమాదాలు ఒక్కసారి చూస్తే 216 ప్రమాదాలు జరిగినట్టు ఘనంగాలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాదుకు మణిహారంగా ఉన్న హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ ఇప్పుడు ప్రజల ప్రాణాలను బలిగొనే రహదారిగా మారుతుంది. వాస్తవానికి గమ్యం చేరడానికి నగరం మధ్యలో నుంచి ప్రయాణం కొనసాగిస్తే ఈ ట్రాఫిక్ లోనే మన సమయం అంత పాడైపోతుంది అని అనుకునే వాహనదారులకు ఔటర్ రింగ్ రోడ్డు వరంగా లభించిన అక్కడ వేగం మితిమీరి పోవడం వలన ప్రమాదాలు ఈజీగా జరుగుతున్నాయి. వాస్తవానికి చిన్న వెహికల్స్ నడపాల్సిన వేగం మాక్సిమం 120 కిలోమీటర్స్ వేగం ఇంకా ప్రయాణించాలి. ఇక అవే పెద్ద వెహికల్స్ అయితే మాక్సిమం 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలి. కానీ ఇవేవీ పట్టించుకోకుండా చిన్న వెహికల్స్ పెద్ద వెహికల్స్ మితిమీరి వేగం గా ప్రయాణించడం వల్ల ఈజీగా ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. తాజాగా ఈ మధ్యన వరుస ప్రమాదాలు ఎక్కువగా ఓఆర్ మీద జరగడం గమనార్హం. గడిచిన 10 సంవత్సరాలలో 10,000 ప్రమాదాలు జరిగినట్టుగా మనకు గణంకాలు చెబుతున్నాయి.. అందులో ఎక్కువగా గాయాల బారిన పడవలు తక్కువైతే మరణం చెందిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది.

**ఓ ఆర్ ఆర్ అంటేనే వేగంగా వెళ్లడానికి లైసెన్స్ అని అందరూ అనుకుంటారు కానీ అక్కడ ఉన్న పొరపాట్లు ఏంటి..!? అవుటర్ రీజినల్ రింగ్ రోడ్డు మనకు అందితే చాలు మన వాహనం యొక్క వేగం మనకు తెలియకుండానే 120 స్పీడ్ దాటి ముందుకు వెళ్తూనే ఉంది. ఎందుకంటే అక్కడ ఎవరు ఉండరు కాబట్టి వేగంగా ప్రయాణించడానికి మాత్రమే ఔటర్ రీజినల్ రింగ్ రోడ్ వేశారు**



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

**కాబట్టి అంత స్పీడ్ గా వెళ్లాలి అనే ఆలోచన మైండ్లో ఫిక్స్ అయిపోవడం ఎందుకు ప్రధాన కారణం. నిజమే అవుటర్ రీజినల్ రింగ్ రోడ్డుపై వేగంగా వెళ్లడం ఒక భాగం అయితే ఇక్కడ టోల్ గేట్ దగ్గర ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్న వ్యవస్థ రీజనల్ రింగ్ రోడ్ పై ఉన్న గుంతలను పూడ్చకపోవడం, స్పీడ్ గా ఒక్కొక్క వెహికల్ ఎంత స్పీడ్ తో వెళ్ళాలో తెలియజేసే బోర్డులు ఉండకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. అంతేకాదు రాత్రి వేళల్లో అవుటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి కాబట్టి కొంతమంది వాహనదారులు రహదారి పక్కన ఆపుకొని ఉండడం చీకట్లో వేగంగా వస్తున్న కారుకు కనిపించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారుతున్నాయి.**

నిజానికి రీజినల్ రింగ్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్స్ ఉండకపోవడం హైవేపై గుంతలు ఉండడం ముఖ్యంగా పెట్రోలింగ్ అస్సలు లేకపోవడం పెద్ద పొరపాటుగా కనిపిస్తోంది... టోల్గేట్ దగ్గర ప్రతి ఒక్కరిపై రుసుం వసూలు చేసే వ్యవస్థ ప్రమాదాలు పడకుండా తీసుకోవాల్సిన కనీస మౌలిక వసతులకు కూడా అక్కడ కల్పించకపోవడం అనేక ఆరోపణలకు నెలవుగా మారుతుంది. ముఖ్యంగా సీసీ కెమెరాలు కూడా లేకపోవడం మానిటరింగ్ లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణభూతాలుగా కనిపిస్తున్నాయి. భాగ్యనగర వాసులే కాకుండా ఔటర్ రీజినల్ రింగ్ రోడ్డు పై ప్రయాణిస్తున్న ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన విషయాలను కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

> **భాగ్యనగరానికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్ మన ప్రయాణానికి సులువైన మార్గమే అయిన మీరు ఆ రోడ్డుపై వెళ్లేటప్పుడు మితిమీరు వేగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే రోడ్డుపై స్పీడుగా వెళ్తున్న తరుణంలో కొన్ని గుంతలు కూడా ఉండడం వల్ల ప్రమాదాలకు దగ్గరగా ఉన్నామని ఆలోచనకు వాహనదారులు రావాలి.. అక్కడ సీసీ కెమెరాలు కూడా లేకపోవడం అందులో భాగంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు రోడ్డుకి ఇరువైపులా ఎవరైనా పార్కు చేశారా లేదా చూసుకుంటూ వాహనాన్ని నడిపించుకుంటూ గమ్యస్థానం చేరాలి. అంతేకానీ ఓఆర్ఆర్ పై విచ్చలవిడిగా మద్యం సేవించి వాహనం నడపడం వలన మనం సమస్యల్లో చిక్కుకోవడమే కాకుండా ఎదుటి వారిని కూడా సమస్యల్లోకి నెట్టేస్తాం. ఇది పెద్ద సమస్యగా మారుతుంది...**

భాగ్యనగరానికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్ మన ప్రయాణానికి సులువైన మార్గమే అయిన మీరు ఆ రోడ్డుపై వెళ్లేటప్పుడు మితిమీరు వేగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే రోడ్డుపై స్పీడుగా వెళ్తున్న తరుణంలో కొన్ని గుంతలు కూడా ఉండడం వల్ల ప్రమాదాలకు దగ్గరగా ఉన్నామని ఆలోచనకు వాహనదారులు రావాలి.. అక్కడ సీసీ కెమెరాలు కూడా లేకపోవడం అందులో భాగంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు రోడ్డుకి ఇరువైపులా ఎవరైనా పార్కు చేశారా లేదా చూసుకుంటూ వాహనాన్ని నడిపించుకుంటూ గమ్యస్థానం చేరాలి. అంతేకానీ ఓఆర్ఆర్ పై విచ్చలవిడిగా మద్యం సేవించి వాహనం నడపడం వలన మనం సమస్యల్లో చిక్కుకోవడమే కాకుండా ఎదుటి వారిని కూడా సమస్యల్లోకి నెట్టేస్తాం. ఇది పెద్ద సమస్యగా మారుతుంది... నవీన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్న ఈ సమాజంలో వేగం ముఖ్యం కాదు ప్రాణం ముఖ్యం అనే విధంగా మితిమీరిన వేగాన్ని అందుకోకుండా గమ్యస్థానానికి చేరాలంటే ఔటర్ రింగ్రోడ్ అయిన మరెక్కడైనా మన వేగాన్ని మనం కంట్రోల్ చేసుకునే విధంగా వాహనాన్ని నడిపిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

**ఇక టోల్ వసూలు చేస్తున్న వ్యవస్థ కేవలం వసూళ్లకే ఎగబడుతుందని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. రోడ్లపై గుంతలు పూడ్చకపోవడం రోడ్డుపై సీసీ కెమెరాలు పెట్టకపోవడం రాత్రి వేళల్లో మానిటరింగ్ లేకపోవడం మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం ఇలాంటివి ఎన్నో కోకోల్లలుగా కనిపిస్తున్నాయి... ఇప్పటికైనా ప్రజలు అవగాహన కలిగించుకొని ప్రశ్నించే తత్వాన్ని నేర్చుకొని మన గమ్యస్థానాలకి క్షేమంగా చేరుకోవాలని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి.**

## ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ కు బెదిరింపు ఈ మెయిల్

జయభేరి, న్యూ ఢిల్లీ మార్చ్ 24 :

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్త్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

## ఇంటింటికీ గంగమ్మ

జల్ జీవన్ మిషన్ 2.0 కింద 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే లక్ష్యాన్ని సాకారం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం కార్యక్రమంలో ఆయన అమరావతి నుండి వర్చువల్‌గా పాల్గొన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థల నిర్వహణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 2025 సెప్టెంబర్‌లోనే సమగ్ర విధానాన్ని ప్రకటించామని గుర్తు చేశారు. తాగునీటి వ్యవస్థల ఆపరేషన్ బాధ్యతను పంచాయతీలకే అప్పగించామని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ మిషన్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని కొనియాడారు. జేజేఎం గడువును 2028 వరకు పొడిగించినందుకు ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. నీటి నాణ్యత పరీక్షల్లో డ్వాక్రా మహిళల పాత్ర కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ, ఏపీలో నీటి నాణ్యతను పరీక్షించే బాధ్యతలో డ్వాక్రా మహిళల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 16 కోట్ల గృహాలకు కుళాయిలు ఇచ్చామని, మిగిలిన 3 కోట్ల ఇళ్లకు జేజేఎం 2.0 ద్వారా నీరందిస్తామని చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారు 9 కోట్ల మంది మహిళలకు నీటి కోసం పడే కష్టాలు తప్పుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఇంటికీ సురక్షిత నీరు చేరడం ప్రాథమిక అవసరమని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకు 'పీఎం జన్ మన్' నిధులు మారుమూల మరియు గిరిజన ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు పీఎం జన్ మన్, పీఎం జన్ భాగీదారీ నిధులను వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. త్వరలోనే ఏపీలోని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ సమావేశం ఏర్పాటు చేసి ప్రాజెక్టు లక్ష్యాలను నిర్దేశించుకుందామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి మేరకు మిషన్ పొడిగింపునకు సానుకూలంగా స్పందించినట్లు పాటిల్ వెల్లడించారు. ఢిల్లీలో ఎంఓయూపై సంతకాలు ఢిల్లీలోని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర జల్ శక్తి కార్యదర్శి అశోక్ కుమార్ మీనా, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన మరియు పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల నిర్వహణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అమరావతి నుండి వర్చువల్‌గా పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- **దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆరోపణ**

**జయభేరి, దేవరకద్ర :**



రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల వారిని మోసం చేసిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆరోపించారు. వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండల కేంద్రంలో మంగళవారం సర్పంచు,ఉప సర్పంచుల మరియు వార్డ్ సభ్యుల ల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల,కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.




రైతులకు రుణమాఫీ, రైతుబంధు,బోనస్ వరి కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చి, ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా పబ్బం గడుపుతోందన్నారు. ఆడపిల్లలకు స్కూటీలు, తులంగా బంగారం ఏవి ఇవ్వక పోగా ఆడ బిడ్డలను తీవ్రంగా మోసం చేసిందన్నారు.
మళ్లీ రెండు సంవ త్సరాల తర్వాత ఖచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యకర్తలు మనోధైర్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ఆరుగారెంటీల పైన అన్ని సందర్భాల్లో పోరాడుతూ ధైర్యంగా ఉండాలన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా సరే కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మండలానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు, సర్పంచులు,ఉప సర్పంచులు,మాజీ సర్పంచులు,వార్డు మెంబర్లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టమాట రైతులకు గిట్టుబాటు ధర లేక రైతు ఆవేదన

- **ప్రభుత్వం తక్షణమే మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం అధ్యక్షుడు మాసవరపు కేశవరావు డిమాండ్**

**జయభేరి, పరవాడ:**









అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ పరిధిలోని విసన్నపేట గ్రామానికి చెందిన మండల రైతు సంఘం అధ్యక్షుడు మాసవరపు కేశవరావు టమాటా పంట సాగు చేసి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.పండించిన టమాటాకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎరువులు,విత్తనాలు,రోజు వారి కూలీలు రేట్లు, ట్రాన్స్పోర్ట్ వ్యయాలు పెరగడంతో పంట సాగు ఖర్చులు అధికమయ్యాయని,కానీ మార్కెట్ లో సరైన ధర లేక రైతులు అప్పుల బారిన పడుతున్నారని తెలిపారు. రైతులకు ప్రభుత్వం నుంచి సరైన మద్దతు ధర, పెట్టుబడి సాయం అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
గతంలో జగన్ ప్రభుత్వం టమాటాకు కిలోకు రూ.7 వరకు మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకుందని గుర్తు చేశాడు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కనీసం రూ.3 కూడా మద్దతు ధర లభించడం లేదని విమర్శించారు.
రైతులను ఆదుకోవడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, తక్షణమే స్పందించి టమాట రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పెట్టుబడి సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో ఉన్న రైతులను ఆదుకోవాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు మాసవరపు కేశవరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# క్షయ వ్యాధి నివారణకు ప్రతి పౌరుడు సమిష్టిగా కృషి చెయ్యండి

- **పరవాడ జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం**

**జయభేరి, పరవాడ:**




ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పరవాడ, మరియు వాడ చీపురుపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రములు వద్ద స్థానిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సంయుక్తంగా భారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. కనక అప్పారావు మాట్లాడుతూ క్షయవ్యాధి లేదా టిబి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బాక్టీరియా (సూక్ష్మజీవి) వల్ల కలిగే ఒక వ్యాధని టిబి సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది, కానీ ఇది గ్రంథులు, ఎముకలు శరీరంలోని ఇతర భాగాలను కూడా ప్రభావితం చేయగలదు అని అన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు జ్వరం మరియు దగ్గు (సాధారణంగా 3 వారాల కంటే ఎక్కువ కాలం ఉంటుంది)బరువు తగ్గడం,కఫంలో రక్తం ఇలాంటి లక్షణాలు ఎవ్వరయినా ఉంటే సలహా కోసం ప్రభుత్వ వైద్యుడిని సంప్రదించాలని అన్నారు.
డా.జయశ్రీ కరిష్మా మాట్లాడుతూ క్షయ వ్యాధి చాలా ప్రాణాంతకమైన అంటు వ్యాధని దీనిని అంతం చేయవలసిన బాధ్యత ప్రతి పౌరుడు మీద ఉన్నదని మీ ఆరోగ్య కేంద్రాల్లో క్షయ నివారణ సేవలు అందుబాటులో ఉన్నాయిని అన్నారు.
ఈ కార్యక్రమంలో డా.హారిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం. ఎస్.సాయిరాం, లూపిన్ సంస్థ నుండి వెంకట నారాయణ, ఎం.పి.హెచ్.ఇ.ఓ గణేష్,పీ.హెచ్.ఎన్. జానకి రామన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సూపర్వైజర్స్ ఎం.ఎస్. ప్రసాద్, సత్యనారాయణ, పి.వి. రత్నం. హెల్త్ అసిస్టెంట్లు,ఎ.ఎన్.ఎమ్ లు ఎం.ఎల్.పి,లు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 24 :**



ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వడ్డెర సంఘం నాయకుడు ఓర్సు బిక్షపతి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో వడ్డెర సంఘం నాయకులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టినటువంటి వడ్డెర కార్పొరేషన్ కి వెయ్యి కోట్ల బడ్జెట్ను ఏర్పాటు చేస్తామని చెప్పి గాలికి వదిలేసారని అన్నారు. వడ్డెరలను బీసీ ఏ నుండి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిలో వల్లపు మహేందర్, ఇరగదిడ్ల కర్ణాకర్ ఉన్నారు.



# పన్నుల చెల్లింపుతోనే మున్సిపల్ అభివృద్ధి సాధ్యం

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 24:**

అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వర్తక వ్యాపార సముదాయాల వారు ఈ నెల 31 వ తేదీ లోపు వారి ట్రేడ్ లైసెన్స్ లను రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ సూచించారు. 2025 26 సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసిపోనునందున ఈ నెల 31 తేదీ లోపు ఆన్ లైన్ లో లేదా బిల్ కలెక్టర్లు / మున్సిపల్ కార్యాలయం లో చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని వారు సూచించారు. ఫీజు చెల్లించని వారు మున్సిపల్ చట్టం 2019 ప్రకారం 25 శాతం పెనాల్టీ ఫీజు చెల్లించాలన్నారు. అందువల్ల అందరూ నిర్ణీత సమయంలో ఫీజు చెల్లించి లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

# వేములదేవరకద్ర రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

- **అసెంబ్లీలో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని వేముల దేవరకద్ర రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మంగళవారం అసెంబ్లీలో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ వేముల దేవరకద్ర జాతీయ రహదారి మెయిన్ కనెక్టివిటీ రోడ్డుకు 2017లో టెండర్ వేసి కేవలం 5 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తి చేశారన్నారు. మిగిలిన 12 కి. మీటర్ల మేర రోడ్డుకు కేవలం కంకర వేసి అలాగే వదిలేశారన్నారు. గత ప్రభుత్వం దీనిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కావున మిగిలిపోయిన ఈ రోడ్డు పనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, రోడ్డు పనులను ప్రారంభించాలని ఆర్ అండ్ బి మంత్రిని అసెంబ్లీలో ఎమ్మెల్యే జీఎంఆర్ కోరారు.

# పెండింగ్ 19 లక్షలు.. ఇస్తామన్నది 2 లక్షలే

**జయభేరి, హైదరాబాద్ :**

మాకున్న సమాచారం ప్రకారం ప్రభుత్వం దగ్గర 19 లక్షల పెన్షన్ దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి, వాటిలో 2 లక్షల మందికి ఇస్తే సరిపోతుందా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు. మంగళవారం అయన శాసనసభలో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. మరి 19 లక్షల దరఖాస్తులు వున్నప్పుడు కేవలం రెండు లక్షలే ఇస్తారా అని ప్రశ్నించారు.



# తులసి కాటేజ్ నుంచి మల్లాపూర్ వరకు పరుగులు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి24 :**

శారీరక దృఢత్వం క్రమశిక్షణ పెంపొందించుకోవడం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దర్శనార్థం విచ్చేసి భక్తులకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యంగా యాదగిరిగుట్టలో తెలంగాణ టీజీ ఎస్పీఎఫ్ సిబ్బంది మంగళవారం పది కిలోమీటర్ల పరుగు చేపట్టింది. టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లాక్రా ఆదేశాలు మేరకు కమాండెంట్ ఎన్. త్రినాధ్ సూచనల మేరకు యాదగిరిగుట్ట ఆలయ భద్రతా ఎస్పీఎఫ్ సిబ్బందికి మంగళవారం ఉదయం పది కిలోమీటర్ల పరుగు కార్యక్రమం నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు సాగిన ఈ పరుగులో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించడం భక్తులకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఇన్ స్పెక్టర్ కె. శేషగిరి రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏడవ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

- **మున్సిపల్ చైర్స్ పర్సన్ గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్**



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 24:**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని ఏడవ వార్డులో నెలకొన్న సమస్యలను,ఇబ్బందులను పరిష్కరిస్తామని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అన్నారు. మంగళవారం ఏడవ వార్డులో ఆమె పర్యటించారు. డ్రైనేజీ సమస్య లు,సిసి రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఏడో వార్డు ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక బద్ధంగా ఏడవ వార్డును తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఏడవ వార్డు ప్రజలతో ఆమె అన్నారు. ఏడవ వార్డును పరిశీలించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, ఏడవ వార్డు కౌన్సిలర్ పెలిమెల్లి లావణ్య శ్రీధర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ,మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుకు శాశ్వత భవనం

- **యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూదగాని శ్రీహరి, ఉపాధ్యక్షులుగా పెంట రమేష్, సారాశి సంతోష, ప్రధాన కార్యదర్శిగా ఐరేని కృష్ణ**

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 24 :**

యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదగాని శ్రీహరి రెండవ సారి ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదగాని శ్రీహరి, ఉపాధ్యక్షులుగా పెంట రమేష్,సారాశి సంతోష, ప్రధాన కార్యదర్శిగా ఐరేని కృష్ణ,సహాయ కార్యదర్శిగా దండమేని గణేష్,క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా రేణుక,కార్యవర్గ సభ్యులుగా కనకరాజు, నవితలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షులు సుదగాని శ్రీహరి మాట్లాడుతూ.. రెండవ సారి తన ఎన్నికకు సహకరించిన న్యాయవాది సోదరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యాదగిరిగుట్ట కోర్టుకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు సహచర న్యాయవాదుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ సమావేశానికి సీనియర్ న్యాయవాదులు గుడ్ల స్వామి,మొగుల్ల రాజిరెడ్డి, గొట్టిపాముల సాయికృష్ణ, దప్పు వీరస్వామి, ఎరుకల సత్యనారాయణ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# సేంద్రీయ కూరగాయల సాగుకు మహిళలు ముందుకు రావాలి

- **ఆత్మ డైరెక్టర్ మధుమోహన్**



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 24:**

సేంద్రీయ కూరగాయల సాగుకు మహిళలు మొగ్గు చూపాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుమోహన్ సూచించారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలంలోని మహిళ గ్రూపు సభ్యులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుమోహన్ తో పాటు కె వి కె శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు తమ ఇంటి పరిసరాల్లో సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు సాగు చేసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసిన తర్వాతే పంటల సాగు చేయాలని సూచించారు. అనంతరం మహిళా రైతులకు కిచెన్ గార్డెన్, కూరగాయల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్, కౌన్సిలర్ సరసం వనజ, మహిళ సంఘం అధ్యక్షురాలు అజయ్ లక్ష్మీ, ఆత్మ బిటీ ఏం సంతోష్, సాగరిక, నాగశ్రీ , కోశాధికారి నర్మద, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత గాలి కుంటూ వ్యాధి నివారణ టీకాల పంపిణీ

జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 24 :

తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సోన్నాయిల రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ తమ పశువులకు టీకాలను వేయించుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి వేసవి కాలంలో పశువులకు వచ్చే జబ్బుల గురించి వాటి నివారణ చర్యల గురించి వివరించారు. గ్రామంలో 122 పశువులకు టీకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల బాలయ్య, వార్డు సభ్యులు తోడేటి సత్యనారాయణ, పశు వైద్య సిబ్బంది ఎల్ఎస్ఏ శేఖర్ , వెటర్నరీ అసిస్టెంట్ రాఘవేందర్, శంషాద్దీన్, పెండెం ప్రవీణ్, గోపాలమిత్ర వీరు సత్యనారాయణ, శ్రీకాంత్, నరేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు



జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 24 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 25, 26 ,27 తేదీల్లో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్ తెలిపారు. 25వ తేదీ బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రతిష్టా దేవతలకు అభిషేకం, అర్చన, తీర్థ ప్రసాద వితరణ, 26వ తేదీ గురువారం ఉదయం శ్రీ ఆంజనేయ స్వామి వారికి అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి మూల మంత్ర సహిత రుద్ర హోమం, అనంతరం అన్నదాన కార్యక్రమం, 27వ తేదీ శుక్రవారం నిమిషాలకు శ్రీ సీతారాముల వారికి పంచామృతాభిషేకాలు, శ్రీ సీతారాముల కళ్యాణం, అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పై కార్యక్రమాల్లో, స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు సాంప్రదాయ దుస్తులతో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## మన్యంకొండలో సుందరకాండ పారాయణం

- ఆలపించిన వారికి ఘన సన్మానం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వసంత నవరాత్రుల సందర్భంగా సుందరకాండ పారాయణ కీర్తలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మణ సుందరకాండ పారాయణ కీర్తనలు ఆలపించిన వారిని మంగళవారం దేవస్థానం తరపున దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతో పాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## నిద్రమత్తులో డ్రైవింగ్‌పై బీమారం పోలీసుల ప్రత్యేక చర్యలు

- డ్రైవర్లకు అవగాహన, భద్రతకు ప్రాధాన్యం



జయభేరి, మంచిర్యాల :

రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల జోన్ బీమారం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో రాత్రివేళల్లో నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో బీమారం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాత్రివేళల్లో పహారా నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లను గుర్తించి, వారికి తక్షణమే విశ్రాంతి కల్పించే చర్యలు తీసుకుంటున్నారు. డ్రైవర్లకు ముఖం కడగించి, టీ తాగించడంతో పాటు కొంతసమయం వారితో మాట్లాడి నిద్రమత్తు తగ్గేలా చేసి, అనంతరం మాత్రమే ప్రయాణం కొనసాగించాలని సూచిస్తున్నారు. అదే విధంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, అలసటగా ఉన్నప్పుడు వాహనం నడపకూడదని, అవసరమైతే విరామం తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధాన లక్ష్యంగా బీమారం ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, రాత్రి సమయంలో జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

# రైతులకు రేవంత్ సర్కార్ తీపి కబురు

- సాదాబైనామా కష్టాలకు విముక్తి
- 9 లక్షల మంది రైతులకు లబ్ధి
- జీహెచ్ఎంసీ అభివృద్ధికి రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు: శ్రీధర్‌బాబు





జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా.. శాసనమండలిలో సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇస్తూ కీలక ప్రకటన చేసారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినప్పటికీ.. 2020 ఆర్వోఆర్ చట్టంలో వాటి పరిష్కార మార్గాన్ని చూపించలేదని మంత్రి విమర్శించారు. సాదాబైనామా సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపే క్రమంలో.. కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధన వల్ల క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని.. ఇకపై కేవలం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు జీవో 76 విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకు పైగా సాదాబైనామా దరఖాస్తుదారులకు లబ్ధి చేకూరనుందని చెప్పారు. ప్రస్తుతం నక్షా మ్యాప్ లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందులో ప్రతి సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్' కేటాయించినట్లు స్పష్టం చేశారు. త్వరలోనే హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన 32 జిల్లాల్లో, ఒక్కో జిల్లాలో 70 గ్రామాల చొప్పున భూసర్వే నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత దశలవారీగా భూధార్ నెంబర్లు జారీ చేస్తామని.. తద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

### జీహెచ్ఎంసీ అభివృద్ధికి రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు: శ్రీధర్‌బాబు

ఇక మున్సిపల్‌శాఖ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని శాసనసభలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధికి రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు. రూ.122 కోట్ల మాత్రమే ఖర్చు చేశారని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చెప్పారని అదంతా పూర్తి అవాస్తవమన్నారు. 2016లో ఎస్ఆర్‌డీపీని తీసుకువచ్చారని.. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలుపెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రణాళిక ప్రకారంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. లింక్‌రోడ్లకు సంబంధించిన పనులను 15 రోజుల్లో ప్రారంభిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



## 26న టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ

జయభేరి, దేవరకద్ర :

దేవరకద్ర విద్యా వనరుల కేంద్రం ,కేజీబీవీ లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 26న ఛలో నిర్వహించే అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ దేవరకద్ర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.శంకర్, డి కృష్ణయ్య కోరారు. ఈ సందర్భంగా కే. శంకర్ మాట్లాడుతూ బాలికల కోసం నిర్వహిస్తున్న కేజీబీవీలు, సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న వేతనాలు మాత్రం అరకొరగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చేసిన అనేక పోరాటాల ఫలితంగా రెండు, మూడు సమస్యలు మాత్రమే పరిష్కారం అయ్యాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు జరపకపోగా గత సంవత్సరం 29 రోజులు సమ్మె చేసిన సమయంలో ఉప ముఖ్యమంత్రితో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన డిమాండ్లు కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. మినిమం బేసిక్ పే లేకుండా శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వ శిక్ష పరిధిలో పనిచేస్తున్న సిఆర్టిలు, సీఆర్పీలు, ఎంఐఎస్ లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పిలు, పి ఈ టి లకు మినిమం బేసిక్ పే అమలు చేస్తూ, ఉద్యోగ భద్రత కల్పిస్తూ, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డు జారీ చేయాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ మేరకు సహేతుకమైన నిర్ణయం తీసుకొని పార్లమెంట్ కు సమర్పించే సమగ్ర విద్యా నివేదికలోనే మినిమం బేసిక్ పే నిర్ణయం తీసుకొని అమలు చేయడం కోసం మార్చి 26న చలో అసెంబ్లీ కార్యక్రమంలో దేవరకద్ర మండలంలోని సర్వ శిక్షా ఉద్యోగులు, కేజీబీవీ ఉద్యోగులు, పీఈటీలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఐదేళ్ల బాలిక పై ఇద్దరు మైనర్ల లైంగిక దాడి



జయభేరి, భూపాలపల్లి ;

భూపాలపల్లి జిల్లాలో దారుణం జరిగింది. ఐదేళ్ల చిన్నారిపై ఇద్దరు మైనర్ బాలురు లైంగిక దాడికి పాల్పడ్డారు. కాటారం డివిజన్ పరిధిలోని మహదేవపూర్ ప్రాంతంలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారిని ఎత్తుకెళ్లి, పక్కన ఉన్న పార్కులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

## ప్రశిక్షణా తరగతుల్లో పాల్గొన్న కొండ ప్రశాంత్

- హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకల్, కొత్తకోట, కొత్తకోట టౌన్, మదనాపురం మండలాలలో పండిట్ దీన్ దయాల్ ప్రశిక్షణా మహాభియాన్ తరగతుల్లో దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డిలతో కలసి దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యనిర్వాహణ ముఖ్యమని, పార్టీ బలోపేతం కావాలంటే బూతు స్థాయి నుండి బలపడాలని అన్నారు. పార్టీ బలపడాలంటే బూతు స్థాయి కార్యకర్తల కృషి ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షణ తరగతుల చైర్మన్ విద్యాసాగర్ రావు, ప్రశిక్షణా తరగతుల ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రకాష్ రెడ్డి, ఎగ్గని నర్సింలు ,అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షులు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు భరత్ భూషణ్, అడ్డాకుల మండల అధ్యక్షులు రమేష్, మదనపురం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కొత్తకోట మండల అధ్యక్షుడు నరసింహ, కొత్తకోట పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, , రాఘవేందర్ రెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిలిమిటేషన్లో చందంపేట నియోజకవర్గం

జయభేరి, చందంపేట :



నూతన నియోజకవర్గాల ఏర్పాటులో భాగంగా డిలేమటేషన్ లో చందంపేట గుండ్లపల్లి ( డిండి) , నేరేడు గో మ్ము, పెద్దఅడిశర్లపల్లి ఈ నాలుగు మండలాలు కలిసి చందంపేట నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని గిరిజన మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జరుపుల లోక్యానాయక్ డిమాండ్ చేసినారు. నల్గొండలో కొత్తగా మూడు నియోజకవర్గాలను ఏర్పాటు చేసే ప్రక్రియ జరుగుతుందని అందువలన ఈ నాలుగు మండలాల్లో గిరిజన పాపులేషన్ ఎక్కువ గా ఉన్నందున ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గంగా చందంపేట కేంద్రంగా ఏర్పాటు నూతన నియోజకవర్గం నీ ఏర్పాటు చేయాలని ఆయన అనఅన్నారు.

ఈ కార్యక్రమంలో లోక్య నాయకులు వెంట చందంపేట మండలం బిఆర్ ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు యాసాని రాజవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ముఖ్య సలహాదారులు మోహన్ కృష్ణ, మాజీ జెడ్పిటిసి బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ మూడు గండ్ల ఎంపీటీసీ ఇస్లావత్ సునీత బాలవర్ధిరాజు, గోసుల శివ, జబ్బు శ్రీశైలం ,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, బలరాం, రాజు, నరేష్, గోపాల్, తరి గోవర్ధన్, సైదులు, సత్యనారాయణ గౌడ్ ,కే శంకర్ నాయక్, రామకోటి, దామర శ్రీను, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలి

- మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ (MMC) భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆహ్వానించారు

జయభేరి, ఉప్పల్ :



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, వచ్చే వారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ (MMC) భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినమ్రంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉప్పల్ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రామంతపూర్ ప్రాంతం లో కొత్త పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని 2009లో నిర్మించిన ఇందిరా గృహకాల్ప పథకం కింద నిర్మించిన కాలనీల్లో నీటి లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్లు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఏ విభాగం పెట్టించుకోవటం లేదు అని ఆయన అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాలనీ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కి స్థలం కేటాయించాలని కోరారు. పటేల్ కుంట అలాగే రామాంతపూర్ చిన్న చెరువులను అభివృద్ధి చేయాలని ఆయన కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా..

- **ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి డివిజన్ లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**జయభేరి, కాప్రా :**

కుషాయిగూడలోని పోచమ్మ గుడి సమీపంలో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ డ్రైనేజ్ పనుల ద్వారా స్థానిక ప్రజలకు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం చక్రిపురం కాలనీలో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో కాలనీవాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. టీచర్స్ కాలనీలో సీసీ రోడ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు పాండు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశోక్, గౌరవాధ్యక్షులు మొగిలి, రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు డిఎం కొండారెడ్డి, సలహాదారులు సహదేవ్ గౌడ్, రణధీర్ రెడ్డి, జి మురళి, సంతోష్ గుప్తా, జగన్మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, యాకయ్య, మధుసూదన్ రెడ్డి, రాజు, ప్రకాష్, వెంకటేష్ గుప్తా, మైపాల్ రెడ్డి, తన్నీరు వెంకటేష్, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఆలేటి మహిపాల్ రెడ్డి, టీచర్స్ కాలనీ అధ్యక్షులు తిరుమల కృష్ణ గౌడ్ ప్రధాన కార్యదర్శి బురుగు నరసింహ కాలనీ ఫౌండర్ విజయ్ కుమార్ స్వామి లీగల్ అడ్వైజర్ నర్సింగ్ రావు శాశ్వత సలహాదారులు వేముల నరసింహ గౌడ్ సలహాదారులు నాయిని శేఖర్ రెడ్డి పో రెడ్డి శ్రీకాంత్ పడగంటి ఆంజనేయ చారి రాములు చారి ఉపాధ్యక్షులు మాఊరి తిరుమల కమల లలిత నాయక్ జాయింట్ సెక్రెటరీ చిట్ల దర్శనం రామ్ రెడ్డి బాలకృష్ణ నరసింహ ముదిరాజ్ కాలనీవాసులు సత్తయ్య రాజు గుప్తా శ్యాంసుందర్ గౌడ్ అజయ్ బాబు మున్నా నాయక్ వెంకటకృష్ణ చౌదరి గూడూరు మహేష్ కుమార్ రాజు నాయక్ విద్యాసాగర్ పాస్టర్. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, కోశాధికారి చిత్తుల కిషోర్ గౌడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాగుల వాసుదేవ ముదిరాజ్, సలహాదారుడు కొడకండ్ల యాదయ్య, వైస్ ప్రెసిడెంట్లు సల్ల వెంకటేష్, బుడంపల్లి వెంకటేష్ గౌడ్. జాయింట్ సెక్రటరీ రాంగిరివార్ నర్సింగ్ రావు, కార్యదర్శి శీలం అనిల్ యాదవ్ తదితరులు పాల్గొనడం జరిగింది. BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా స్వర్గీయ కీ.శే.ఆచార్య జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ

**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

తెలంగాణ సిద్ధాంతకర్త, ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రదాత, అపర మేధావి, తెలంగాణ జాతిపితగా పేరుగాంచిన స్వర్గీయ కీ.శే.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ (సార్) జ్ఞాపకార్థంగా ప్రగతి నగర్‌లోని అలీప్ సర్కిల్‌లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం పూలమాల అర్పించి గణ నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ, తెలంగాణ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం



**జయభేరి, చందంపేట :**

చందంపేట ప్రైమరీ హెల్త్ సెంటర్లో జరిగిన కార్యక్రమములో వాసవి వనిత గ్రేటర్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి మాట్లాడుతూ పూర్వం లాగా క్షయ వ్యాధి ఇప్పుడు ప్రమాదకరం కాదని సులభముగా తగ్గించుకొనవచ్చునని , ఈ సందర్భంగా క్లబ్ తరఫునుండి 10 టిబి మెడికల్ కిడ్స్ అందజేయనున్నామని తెలియజేసినారు. మెడికల్ క్యాంపుకు వచ్చిన రోగులకు డాక్టర్లకి, మెడికల్ సిబ్బందికి, నీరు, బిస్కెట్లు, తేనీరును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో నల్లగొండ జిల్లా డిఎంహెచ్ ఓ, డిప్యూటీ డిఎంహెచ్ ఓ, చందంపేట మెడికల్ ఆఫీసర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ గోవిందు కొండయ్య, బెలిదే మాధవి, కార్యదర్శి బెజవాడ మల్లీశ్వరి, కోశాధికారి ఆలంపల్లి శిరీష, కుంచకూరి సంధ్యారాణి, మెడికల్ సిబ్బంది, వాసవి వనిత సభ్యురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ్ జన్మదిన వేడుకలు

- **5000 రూపాయలు గాయత్రీ పరివార్ కు విరాళంగా ఇచ్చిన శ్రీరామ్**



**జయభేరి, దేవరకొండ :**

ప్రతి ఒక్కరూ తమ హిందూ సంప్రదాయ ప్రకారం జన్మదిన సంస్కారం వివాహ సంస్కారం నిర్వహించుకోవాలని గాయత్రి పరివార్ నిర్వహకులు చంద్రమౌళి అన్నారు. కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన గాయత్రి టైలర్స్ నిర్వాహకులు గాజుల కుశాల్ అజిత దంపతుల కుమారుడు శ్రీరామ్ జన్మదిన సంస్కారాన్ని గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపీఠ్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి గాయత్రి మంత్రం, మృత్యుంజయ మంత్రంతో శ్రీరామ్ ని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయ ప్రకారం జ్యోతి వెలిగించి జన్మదిన సంస్కారాన్ని నిర్వహించుకోవాలన్నారు. జ్యోతి వలె వెలుగుతూ దినదిన అభివృద్ధి చెందాలన్నారు. సన్మార్గంలో ప్రయాణిస్తూ ఆదర్శంగా జీవించాలన్నారు. ప్రతి జన్మదినం సందర్భంగా శ్రీరామ్ తను దాచుకున్న డబ్బులను అంశధానంగా గాయత్రి పరివారకు అందించడం అభినందనీయమన్నారు. శ్రీరామ్ తను దాచుకున్న 5000 రూపాయలను గాయత్రీ పరివార్కు అందించారు. శ్రీరామ్ ను ఆదర్శంగా తీసుకొని పిల్లలు డబ్బులను పొదుపు చేయాలని, దాన గుణాన్ని కూడా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు విజయలక్ష్మి చంద్రమౌళి, ఏరుకొండ రాము, మారం వెంకటేశ్వర్లు, వాసు, మంజుల, వాణి తదితరులు పాల్గొన్నారు.



# భారీ జాబ్ మేళా

**జయభేరి, దేవరకొండ :**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు స్థానిక ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఈరోజు భారీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి మాట్లాడుతూ.. ప్రముఖ ఫార్మా సంస్థ ఎం.ఎస్.ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 'ప్రొడక్షన్ ట్రైనీ' పోస్టుల భర్తీ కోసం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (TSKC) సహకారంతో ఈ నియామక ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామని వెల్లడించారు. ఈ జాబ్ మేళాకు దేవరకొండ డివిజన్ పరిసర ప్రాంత నిరుద్యోగ యువత 100 మంది పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు రాము చౌహన్ ఎల్ఐసి దేవరకొండ సీనియర్ మేనేజర్ ముఖ్యఅతిథిగా హాజరై ఇలాంటి జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని ఎం ఎస్ ఎన్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి కోటయ్య, టీఎస్ కేసి కోఆర్డినేటర్ సి.లింగమయ్య మెంటర్ ఆర్ శివకృష్ణ, వి యాదయ్య తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు భయపడేది లేదు

- **BRSV జిల్లా నాయకులు దంతం రాకేష్ అక్రమ అరెస్ట్**



**జయభేరి, ఘట్కేసర్ :**

BRSV ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉన్న నేపథ్యంలో ఘట్కేసర్ పోలీస్ లు BRSV జిల్లా నాయకులు దంతం రాకేష్ ని ప్రివేంటివ్ అరెస్ట్ చేయడం జరిగింది. దంతం రాకేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షలని అరెస్టుల పేరుతో గొంతు నొకడం సరికాదు. ఎన్ని అక్రమ అరెస్ట్ లు చేసిన పోరాటం ఆగదు అని అన్నారు. కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సిఫార్సుకు విలువ ఇవ్వని సీఎం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. 1. బడ్జెట్ లో విద్య కు 18% ఇవ్వాలి అని విద్య కమిషన్ చెపితే కానీ 8% మాత్రమే కేటాయించారు. 2. గత సంవత్సరం లో 80% రియింబుర్సుమెంట్ విడుదల చేయకుండా విద్యర్థులని మోసం చేసారు. 3. విద్యర్థుల 10,000 కోట్ల రియింబుర్సుమెంట్ బకాయిలు గురించి బడ్జెట్ సమావేశం లో ప్రస్తావన తీస్కుకొని రాలేదు. విద్యార్థుల సమస్యల గురించి పటించుకొని రేవంత్ సర్కారు. ఇంకముందు విద్యర్థి సమస్యల గురించి ప్రతి నిత్యం పోరాటం చేస్తాం అని అక్రమ కేసులకు భయపడేది లేదు అని అన్నారు.

# అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు

- **ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**
- **ప్రజా సమస్యలు పరిస్కరించకుండా అణిచివేయడం దారుణం**
- **ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి**
- **బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**



**జయభేరి, దేవరకొండ :**

అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు అని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బిఆర్ ఎస్వీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి అని ఆయన వారు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిస్కరించకుండా అణిచివేయడం దారుణం అని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలు 420 హామీ అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో కౌన్సిలర్ పొట్ట మధు, నేనావత్ నాగార్జున, తదితరులు ఉన్నారు.

# ఆదాయంలో రంగారెడ్డే టాప్


**జయభేరి, హైదరాబాద్, మార్చి 24 :**

తెలంగాణలో అత్యధిక సంపన్న జిల్లాల జాబితాలో హైదరాబాద్ మరోసారి రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ 2026 నివేదిక ప్రకారం, హైదరాబాద్ జిల్లాకు తలసరి ఆదాయం రూ.4,76,679గా నమోదై, రాష్ట్ర సగటు రూ.3,80,031 కంటే ఎక్కువగా ఉంది. తలసరి ఆదాయం అంటే ఒక జిల్లాలో ప్రతి వ్యక్తి సంవత్సరానికి సగటున సంపాదించే ఆదాయం. ఇది ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేయడానికి కీలక సూచికగా భావిస్తారు. ఇక జీడీపీ అంటే జిల్లాలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆర్థిక విలువ. ఇది ఆర్థిక పరిమాణాన్ని చూపుతుందిగానీ, వ్యక్తిగత ఆదాయాన్ని ప్రతిబింబించదు.

**తెలంగాణలో టాప్ 10 ధనిక జిల్లాలు (తలసరి ఆదాయం ఆధారంగా):**

**తెలంగాణలో తలసరి ఆదాయం ఆధారంగా టాప్ 10 జిల్లాల జాబితా ఇలా ఉంది:**

1. రంగారెడ్డి - రూ.11,29,735
2. హైదరాబాద్ - రూ.4,76,679
3. సంగారెడ్డి - రూ.3,94,587
4. మేడ్చల్ మల్కాజిగిరి - రూ.3,81,506
5. భద్రాది కొత్తగూడెం - రూ.3,69,420
6. మహబూబ్‌నగర్ - రూ.3,36,898
7. ములుగు - రూ.3,35,509
8. యాదాద్రి భూవనగిరి - రూ.3,35,264
9. నల్గొండ - రూ.3,30,216
10. మెదక్ - రూ.3,29,209




ఈ జాబితాలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.

GDDPలో కూడా హైదరాబాద్ రెండో స్థానం: జిల్లా ఆర్థిక పరిమాణాన్ని సూచించే GDDP పరంగా కూడా హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. GDDP ఆధారంగా టాప్ 10 జిల్లాలు:

1. రంగారెడ్డి - రూ.3,41,080 కోట్లు
2. హైదరాబాద్ - రూ.2,25,860 కోట్లు
3. మేడ్చల్ మల్కాజిగిరి - రూ.1,16,133 కోట్లు
4. సంగారెడ్డి - రూ.74,194 కోట్లు
5. నల్గొండ - రూ.64,219 కోట్లు
6. నిజామాబాద్ - రూ.49,974 కోట్లు
7. భద్రాది కొత్తగూడెం - రూ.48,354 కోట్లు
8. ఖమ్మం - రూ.47,184 కోట్లు
9. సూర్యాపేట్ - రూ.38,865 కోట్లు
10. సిద్దిపేట - రూ.37,495 కోట్లు

హైదరాబాద్ నగరానికి వెలుపల ఉన్న ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి జరగడం వల్ల రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం, GDDP రెండింటిలోనూ ముందంజలో ఉంది. ఐటీ, రియల్ ఎస్టేట్, పరిశ్రమల విస్తరణ ఈ జిల్లాలో భారీ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయి.

**రంగారెడ్డి జిల్లా జనాభా: 24,26,243**

హైదరాబాద్ జిల్లా జనాభా: 39,43,323

హైదరాబాద్ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి వేగం ఎక్కువగా ఉండటం వల్ల ఆర్థికంగా అది ముందంజలో ఉంది. తలసరి ఆదాయం, జీడీపీ పరంగా హైదరాబాద్ రెండో స్థానంలో నిలవడం నగర ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తోంది. అయితే వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా తెలంగాణలో ఆర్థిక కేంద్రంగా మారుతున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

# వైభవంగా అమ్మవారికి ఓడిబియ్యం కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ వాసవి మహిళలు దేవరకొండ మండలం కొండ భీమనపల్లిలో దుర్గామాత ఆలయంలో ఆలంపల్లి దీపిక ఆధ్వర్యంలో అమ్మవారికి వాసవి మహిళలు ఒక గ్రూపుగా ఏర్పడి అమ్మవారికి ప్రతినెల అమ్మవార్లకు ఒడిబియ్యం పోసే కార్యక్రమంలో భాగంగా కొండ భీమనపల్లి దుర్గామాతకు నీల సంధ్యారాణి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించినారు. ఆలంపల్లి దీపిక మాట్లాడుతూ అమ్మవార్లకు ఒడిబియ్యం పోసే కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు మాకు ఆ తల్లికి ఒడిబియ్యం పోసే అదృష్టం వచ్చినందుకు చాలా సంతోష పడుతున్నాం అని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో నీల సంధ్యారాణి, సముద్రాల సత్య, ఆలంపల్లి దీపిక, పసుపుల ధనలక్ష్మి, పందిరి ఇందిరా, వాస గిరిజ, పందిరి శ్రీదేవి, గోవిందు జ్యోతి, నేలంటి శ్రీలత, నాళ్ల రజిత, నేలంటి సంధ్య, నూనె శ్రీవిద్య, శీలా స్వప్న, బెల్దే నాగమణి, చందా పద్మ, అర్థం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# అందం పుల్లు.. అవకాశాలు నిల్లు..!

ఈ అమ్మడుకు ఫాలోయింగ్ కూడా ఎక్కువే. ఎవరో గుర్తుపట్టండి. తను మరెవరో కాదు.. యంగ్ హీరో సంతోష్ శోభన్ సరసన ఏక్ మినీ కథ చిత్రంలో నటించిన కావ్య థాపర్. ఈమె పేరు తెలుగు ప్రేక్షకులకు అంతగా తెలియదు. కానీ ముఖ పరిచయమే. ముంబయిలో పుట్టి పెరిగిన కావ్య.. కాలేజీ రోజుల్లోనే నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిం ది. ఆ తర్వాత పతాంజలి, మేక్ మై ట్రిప్, కోహినూర్ వంటి బ్రాండ్లకు మోడల్ గా వర్క్ చేసింది. 2013లో తత్కాల్ అనే హిందీ షార్ట్ ఫిల్మ్ తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఇక ఆ తర్వాత 2018 ఈ మాయ పేరేమిటో తెలుగు మూవీతో కథానాయికగా వెండితెరపై అడుగుపె ట్టింది. ఆ తర్వాత 2019లో మార్కెట్ రాజా ఎంబీబీఎస్ సినిమాతో తమిళం లోకి అడుగుపెట్టింది. ఇక ఆ తర్వాత 2021లో సంతోష్ శోభన్ నటించిన ఏక్ మినీ కథ చిత్రంతో తెలుగు ప్రేక్ష కుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంలో గ్లామర్ షోలతో రచ్చ చేసింది కావ్య. ఆ మధ్య వరుసగా బిచ్చగాడు2, సందీప్ కిషన్ నటించిన ఊరు పేరు భైరవకోన చిత్రాల్లో నటించింది. అలాగే రవితేజ హీరోగా నటించిన ఈగల్ సినియా లోనూ నటించింది. వీటితో పాటు పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన డబుల్ ఇస్మార్ట్ శంకర్ సినిమాలో కనిపించింది. ఈ సినిమాలో గ్లామరస్ లుక్ లో మెరిసింది కావ్య. అలాగే గోపీచంద్ నటించిన విశ్వం సినిమాలో నటించింది. కానీ వరుసగా ఫ్లాప్స్ అం దుకోవడంతో ఈ చిన్నదానికి ఇప్పుడు అవకాశాలు కరువయ్యాయి.



# 'పెద్ది' షూటింగ్‌లో రామ్ చరణ్‌కు స్వల్ప గాయం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, ఈ చిత్రం షూటింగ్ సమయంలో చరణ్‌కు చిన్నపాటి గాయం అయినట్లు సమాచారం. షూటింగ్ సందర్భంగా చరణ్ కంటి సమీపంలో స్వల్ప గాయం తగి లిందని తెలుస్తోంది. అయితే ఈ గాయం విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిన్నపాటి గాయమేనని చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ గాయం కారణంగా చరణ్ రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకోనున్నాడు. అనంతరం తిరిగి షూటింగ్‌లో పాల్గొననున్నా డు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. త్వరలోనే చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనుంది. ఇక ఈ శుక్రవారం రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భం గా 'పెద్ది' చిత్రం నుంచి టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదు రుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తుండగా, ప్రముఖ నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ చిత్రం, చరణ్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక 'పెద్ది' ఐటమ్ సాంగ్ గురించి గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో ముగ్గురు భామలు ఆడిపాడనున్నారని, కాదు నలుగురు హీరోయిన్లు కనిపిస్తారని.. అంటూ అనేక వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.. చివరికి ఇద్దరి పేర్లు మాత్రం ప్రముఖంగా వినిపించాయి. 'రంగస్థలం' సినిమాలో జిల్ జిల్ జిగేల్ రాణిగా చెర్రీతో కలిసి చిందులేసిన పూజా హెగ్డేని స్పెషల్ సాంగ్ కోసం సంప్రదిస్తున్నారని టాక్ వచ్చింది. ఆ తర్వాత 'సీతారామం' భామ మృణాల్ ఠాకూర్ ఈ పాటలో ఆడిపాడనుందని చెప్పుకొచ్చారు. ఫైనల్ గా మృణాల్ వైపే మేకర్స్ ఎక్కువ మొగ్గుచూ పారని సమాచారం. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# ఒక్క గెటప్ కోసం 83 లుక్స్?



కొత్త దర్శకులతో పనిచేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు సూపర్‌స్టార్ రజనీకాంత్. ప్రస్తుతం ఆయన 'జైలర్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. నెల్సన్ దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రం ఆగస్ట్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఆ తర్వాత కమల్‌హాసన్ నిర్మాణ సంస్థలో కమల్‌తో కలిసి మల్టీస్టారర్ చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు తలైవా. దీనితోపాటు శివకార్తికేయన్ 'డాన్'ఫేం శిబి చక్రవర్తి దర్శకత్వంలో కూడా రజనీకాంత్ ఓ సినిమా చేయనున్నారు. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నాయి. అయితే.. దర్శకుడు సిబిచక్రవర్తి మాత్రం కాస్త స్పీడ్ మీదే ఉన్నాడు. 'జైలర్ 2' షూట్ పూర్తవ్వగానే.. తన సినిమాను పట్టాలెక్కించాలనే కృతనిశ్చయంతో ఉన్నారాయన. తాను చేయబోయే సినిమాలో రజనీకాంత్ గెటప్ చాలా కీలకం. అందుకే.. ఆ గెటప్ కోసం 83 లుక్స్‌ని డిజైన్ చేయించారట శిబిచక్రవర్తి. వాటిలో మూడు ఫైనల్ చేసి, ఆ మూడింటినీ రజనీకాంత్‌కు ప్రజెంట్ చేశారట. వాటిలో ఒకదాన్ని రజనీ ఫైనల్ చేయాలి. ఒక స్టార్ కోసం ఇంత విస్తృత స్థాయిలో లుక్ ఎక్స్‌పెరిమెంటేషన్ జరగడం భారతీయ సినీ చరిత్రలోనే అరుదైన విషయంగా చెప్పుకుంటున్నారు. దీనిపై తలైవా అభిమానుల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 75ఏండ్ల రజనీపై ఇలాంటి ప్రయోగాలు కరెక్ట్ కాదంటూ కొందరు ఫ్యాన్స్ సోషల్‌మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.

# 'ధురంధర్ 2' సినిమాపై సిక్కుల ఆగ్రహం.. క్షమాపణలు చెప్పిన మాధవన్..





రణ్ వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. మార్చి 19న విడుదలైన ఈ సినిమా ఇప్పటికే 750 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. రికార్డు వసూళ్లతో వెయ్యి కోట్ల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. అయితే ఇప్పుడు ఈ బ్లాక్ బస్టర్ మూవీ ఓ వివాదంలో చిక్కుకుంది. సినిమాలో ఒక సన్నివేశంలో సిక్కు మత పవిత్ర గ్రంథంలోని వాక్యాలను అవమానించారనే ఆరోపణలపై చిత్ర కథానాయకుడు రణవీర్ సింగ్, ఆర్. మాధవన్, దర్శకుడు ఆదిత్య ధర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. మహారాష్ట్ర సిక్కు సంస్థ అధ్యక్షుడు గుర్జోత్ సింగ్ కీర్ ముంబైలో ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. ఈ చిత్రంలోని ఒక సన్నివేశంలో, గురు గోవింద్ సింగ్ రచించిన పవిత్ర 'దశమ్ గ్రంథం'లోని శ్లోకాలను పఠిస్తూ నటుడు ఆర్. మాధవన్ సిగరెట్ తాగుతూ కనిపించారు. ఇది సిక్కు సమాజపు మతపరమైన మనోభావాలను దెబ్బతీసిందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. 'గురుబానీ కేవలం ఒక సంభాషణ కాదు, అది దైవికమైనది. పవిత్రమైనది. సిగరెట్ తాగుతూ దానిని పఠించడం క్షమించరాని నేరం,' అని గుర్‌జోత్ సింగ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాగా ఈ విషయంపై చిత్ర బృందం బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే, దర్శకుడు ఆదిత్య ధర్, నటులు రణవీర్ సింగ్, మాధవన్ కనిపించే ప్రతిచోటా నల్ల జెండాలు ప్రదర్శించి నిరసన తెలుపుతామని సిక్కు సంస్థలు హెచ్చరించాయి. దీంతో ఈ వివాదంపై నటుడు ఆర్. మాధవన్ స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో సందేశాన్ని పంచుకుంటూ క్షమాపణలు చెప్పారు. "నేను ఎవరి మనోభావాలనైనా దెబ్బతీసి ఉంటే దయచేసి నన్ను క్షమించండి. సినిమాలో శ్లోకం పఠించే ముందు నేను సిగరెట్ తీసుకున్నాను. తెరపై ఎక్కడా కూడా సిగరెట్ తాగుతూ శ్లోకం పఠించే సన్నివేశం లేదు. దర్శకుడు ఆదిత్య ధర్ ఇలాంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉంటారు. మాకు సిక్కు సమాజం పట్ల అపారమైన గౌరవం ఉంది. నేను సినిమా విడుదలకు ముందు కచ్చితంగా స్వర్ణ దేవాలయాన్ని సందర్శిస్తాను. ఈ పొరపాటు ఉద్దేశపూర్వకంగా చేసింది కాదు" అని ఆర్. మాధవన్ చెప్పుకొచ్చారు.

# పదేళ్ల ప్రస్థానం గురించి మాట్లాడిన భూమి ఫడ్నేకర్

సినిమా హీరోయిన్ అనగానే అందరం ఆమె అందం గురించి, ఫేమ్ గురించి, ఎంత ఫామ్‌లో ఉన్నారా అనే విషయాన్ని గురించి, లగ్జరీ గురించి, కాస్ట్యూమ్స్ గురించి, ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్ గురించి మాట్లాడుకుంటాం. కానీ, చాలా అరుదుగా వాళ్ల గో త్రూ అవుతున్న విషయాలు చర్చలోకి వస్తాయి. వాళ్లు తమను తాము అప్‌డేట్ చేసుకునే తీరు ఒకింత ఇన్స్పయిరింగ్‌గా ఉంటుంది. ఈ విషయంలో బాలీవుడ్ నాయిక భూమి ఫడ్నేకర్ ఏం చెబుతున్నారు. ప్రియాంకను ఈ ఇష్యూలో ఎందుకు ప్రస్తావించారు? చూసేద్దాం వచ్చేయండి. ప్రియాంక చోప్రా అంటే నాకు చాలా ఇష్టం అని ఓపెన్ అయ్యారు బాలీవుడ్ హీరోయిన్ భూమి ఫడ్నేకర్. ఎవరికీ ఏ స్థాయీ ఊరికే రాదని అంటున్నారు భూమి. అందుకే ఎన్నో విషయాలు తాను ప్రియాంక చోప్రాను స్ఫూర్తిగా తీసుకుంటానని చెబుతున్నారు. బాలీవుడ్‌లో భూమి ఫడ్నేకర్ అడుగుపెట్టి దశాబ్దం అయింది. తాను చేసిన పాత్రల కోసం ఫిజికల్ గా ఎంతో మారానని అంటున్నారు. దీని వల్ల ఆరోగ్య పరంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నట్టు తెలిపారు. కెరీర్ లో అడుగుపెట్టిన కొత్తలో రివ్యూల కోసం ఎదురుచూసేదాన్నన్నారు భూమి. మౌత్ టాక్‌తో ఆడిన సినిమాలు, వాటి వల్ల నిలబడ్డ హీరోల గురించి కూడా తనకు బాగా తెలుసన్నారు. కెరీర్‌లో తనను డిజప్పాయింట్ చేసిన మూవీ 'ది లేడీ కిల్లర్' అని చెప్పారు. కథ చెప్పినప్పుడు, తాను చదివినప్పుడు సంపూర్ణంగా ఉందని, కానీ, సగం సగం తెరకెక్కించి రిలీజ్ చేశారని, సినిమా చూసి చాలా బాధపడ్డానన్నారు. మేకింగ్‌లోనూ తాను పార్టిసిపేట్ చేసి ఉంటే ఈ ఇబ్బంది వచ్చేది కాదనిపించిందని తెలిపారు. తన చేతిలో లేని విషయం గురించి ఆలోచించడం వేస్ట్ అని, అందుకే ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉండాలనుకున్నానని చెప్పారు. ప్రస్తుతం ఏఐ మీద ఫోకస్ చేస్తున్నానన్నారు ఈ లేడీ.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**